ద్రాక్షారామలో వైభవంగా శ్రీపుష్పోత్సవం

7లో

అంతర్వేది లక్ష్మీనరసింహుని హుండీల ఆదాయం రూ.41.23 లక్షలు



అర్జీదారుని సమస్య వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

స్పందించండి సారూ!

» 'స్పందన'లో సమస్యలు విన్నవించిన అర్జీదారులు » ఈ వారం 228 అర్జీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వచ్చారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు 228 అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా భూ వివాదాలు, ఇళ్ల స్థల పట్టాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు తదితర అంశాలపై అర్జీలు అందాయి. డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, డీపీవో వి.కృష్ణకుమారి, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పెన్షన్ ఇప్పించండి



గుత్తుల సూర్యకాంతం, పెదగాడవల్లిలంక, ఉప్పలగుప్తం మండలం

నాకు 81 ఏళ్లు. వృద్ధాప్యంలో ఉన్న నా పేరున 3.60 ఎకరాల భూమిని నా కుమారులు మూజువాణీగా పంచుకుని ఎప్పటి నుంచో అనుభవిస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో ఆ భూమి నా పేరున చూపిస్తుండడంతో వృద్ధాప్య పెన్షన్‌తో పాటు ఏ ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందట్లేదు. వృద్ధాప్యంలో ఆర్థిక చేయూతనిచ్చేలా పెన్షన్ మంజూరు చేయాలి.

రూ.10వేలు పెన్షన్ ఇస్తామన్నారు

తల్లి కల్యాణితో బొమ్మిడి రాజ్‌కుమార్, మొండెపులంక, పి.గన్నవరం మండలం



బిడ్డకు మూడేళ్ల క్రితం కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించాం. భర్త నారాయణరావు కాలేయాన్ని ఇచ్చాడు. ఆయన ఏ పనీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఆపరేషన్ చేయించిన బిడ్డకుమందులకు, ఇతర వైద్య పరీక్షలకు నెలకు రూ.10వేలకు పైగా ఖర్చవుతోంది. గత ఏడాది ఆగస్టులో అమలాపురం వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఆ గోడు వినిపించగా నెలకు రూ.10వేలు చొప్పున పెన్షన్ ఇప్పించేందుకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా. స్పందనలో అర్జీలు అందించాం. ఇంతవరకూ మంజూరు కాలేదు.మాది నిరుపేద కుటుంబం. బిడ్డను బతికించుకోవడం దుర్భరంగా ఉంది. ప్రభుత్వం కరుణించి పెన్షన్ మంజూరు చేయాలి.

స్పందనలో ఇరవైసార్లకు పైగా అర్జీలు అందించా

ఇలపకుర్తి పెద్దిరాజు, విశ్వేశ్వరాయపురం, మలికిపురం మండలం



విభజన అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్పందనలో ఇప్పటివరకు ఇరవైసార్లకు పైగా అర్జీలు అందించా. ఇంతవరకు నా సమస్య పరిష్కారం కాలేదు. విశ్వేశ్వరాయపురం గ్రామంలో సర్వే నెం.40/6లో నా పేరున ఉన్న 15 సెంట్ల భూమిని కొలతల ప్రకారం అప్పగించాలని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సర్వేలు చేయించాం. అయినప్పటికీ ఏదో ఒక వంకతో సరిహద్దుదారులు సమస్యను పక్కదోవ పట్టిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు. ఇక అధికారుల చుట్టూ తిరిగే ఓపిక కూడా నశించింది.

దివ్యాంగ పెన్షన్ ఇప్పించండి

తల్లి కనకమహాలక్ష్మితో నిమ్రాగ్రేస్, తుమ్మలపల్లి, అల్లవరం మండలం



తొమ్మిదేళ్ల బిడ్డ. ఏమీ తెలియని అమాయకురాలు. మానసిక ఎదుగల లేదు. బిడ్డను అంటి పెట్టుకునే ఉండాలి. దివ్యాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరం సర్టిఫికెట్ చేయించాలంటున్నారు. అక్కడకు వెళ్తే వారు సదరం సర్టిఫికెట్ ఇవ్వట్లేదు. బిడ్డను పెంచడం భారంగా ఉంది. దివ్యాంగ పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.

ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను పునర్నిర్మించాలి

జి.సందీప్, జి.రవికుమార్, కె.వెంకట్, జి.సతీష్, వి.కార్తీక్



ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు

ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకుని రెండు దశాబ్దాలు అవుతోంది. ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోలేదు. దాంతో కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న కళాశాలను కాపాడుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. బీటలు వారిన గోడల మధ్య రక్షణ లేకుండా చదువు సాగించాల్సిన పరిస్థితి. వెంటనే కళాశాలకు నూతన భవనాలు నిర్మించాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోనే....

ఓట్ల లెక్కింపు: కలెక్టర్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను కాట్రేనికోన మండల చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరుస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం పోలైన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరచడంతో పాటు పక్కనే ఉన్న హాలులో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు ఎంపిక చేశామని వివరించారు. కలెక్టరేట్‌లో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనువైన భవనంగా శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేశామని, అంతకంటే మెరుగైన వసతులు గల భవనాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కళాశాల ప్రధాన గేటు వద్ద భద్రతా బలగాలు, రాష్ట్ర సెక్యూరిటీ బృందాలు స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత కల్పిస్తాయన్నారు. ఓట్ల లెక్కింపు జరిగే విధానాన్ని వివరించారు. ఓటర్ల జాబితాలో లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల నాయకులు దూరి రాజేష్, వడ్డి నాగేశ్వరరావు, కాశి లక్ష్మీభవానీ, పి.పవన్‌సూర్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ... ఉద్వేగం!



అమలాపురంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బడుగు సత్యనారాయణ

కోనసీమలో అనూహ్యంగా మారుతున్న సమీకరణాలు

» తెలుగుదేశం, జనసేన అభ్యర్థుల ప్రకటనతో రాజుకుంటున్న రాజకీయం

» వైసీపీలోకి మాజీ మంత్రి గొల్లపల్లి ! » మహాసేన రాజేష్ తప్ప ఎవరైనా సరే

» పవన్‌కల్యాణ్ నిర్ణయం కోసం కొత్తపేట నేత బండారు శ్రీనివాస్ ఎదురుచూపులు

» దాట్ల బుచ్చిబాబుకే మల్లాడి కృష్ణారావు మద్దతు... వేచి చూసే ధోరణిలో జనసేన

» జనసేన ఇన్‌చార్జిల్లో అలముకుంటున్న అసంతృప్తి

తెలుగుదేశం-జనసేన సీట్ల ప్రకటనతో కోనసీమ జిల్లాలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోతున్నాయి. ఉత్కంఠ, ఉద్వేగభరిత పరిస్థితులు ఆయా పార్టీల కార్యకర్తల్లో నెలకొన్నాయి. టీడీపీ అభ్యర్థుల ప్రకటనతో జనసేన ఇన్‌చార్జిలు సహా ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. మరోవైపు సీట్లు కోల్పోయామని భావిస్తున్న టీడీపీ నేతలు వైసీపీ వైపు దృష్టి సారిస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. టీడీపీ, జనసేన సంయుక్త ప్రకటనలో భాగంగా ఇటీవల కోనసీమలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించడంతో జనసేన నేతలు ఒకింత ఆగ్రహంతో ఉన్నారు. పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడుస్థానానికి ప్రకటించిన టీడీపీ అభ్యర్థిని మార్చాల్సిందేనంటూ ఇరు పార్టీల కేడర్ తీవ్రంగా ఉద్యమిస్తోంది. సీటు కోల్పోయిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి సూర్యారావు వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. కాగా మండపేట సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు టీడీపీ టిక్కెట్ కేటాయించారు. రామచంద్రపురం సీటు విషయంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. జనసేనకు ఇస్తారా లేక టీడీపీకి కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. కాగా జిల్లాలో మిగిలిన వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై విశ్లేషణ.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జనసేన సిట్టింగ్ స్థానమైన రాజోలు నుంచి ఈసారి కూడా తమ పార్టీ అభ్యర్థే పోటీ చేస్తారని అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఆ స్థానంపై ఆశలు పెట్టుకుని నియోజకవర్గ ఓటర్లతో మమేకమైన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైసీపీ వైపు మళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రాజోలు నుంచి ఎమ్మెల్యేగా గొల్లపల్లి పోటీ చేసేందుకు వైసీపీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఆయన తాడేపల్లిలో సీఎం జగన్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. జనసేన నుంచి ఎన్నికై వైసీపీలో చేరిన ప్రస్తుత ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అమలాపురం ఎంపీ స్థానానికి వెళతారని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎంపీ టిక్కెట్ ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతుందా లేక మరో అసెంబ్లీ నియోజకవర్గానికి పంపిస్తారా అనేది చర్చనీయాంశమైంది. జనసేన సీటు ప్రకటించినప్పటికీ అభ్యర్థి ఎంపికలో అన్వేషణ కొనసాగుతోంది.

మహాసేన రాజేష్ వద్దు.. మరెవరైనా సరే...

పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని అటు టీడీపీ, ఇటు జనసేన నేతలు వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ కార్యాలయాన్ని మూసివేయడంతో పాటు పలువురు నేతలు పార్టీకి రాజీనామా కూడా చేశారు. నిర్ణయం మార్చుకోకపోతే వ్యతిరేకంగా పనిచేయాల్సి వస్తుందంటూ జనసేన నేతలు అల్టిమేటం జారీ చేశారు. అంబాజీపేట కేంద్రంగా మంగళవారం జరిగే పి.గన్నవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ పరిశీలకులు సైతం హాజరుకానున్నారు. మహాసేన రాజేష్ పట్ల వ్యతిరేక అంశంతో పాటు బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ-జనసేన సభ విజయవంతంపై చర్చించే అవకాశం ఉంది.

పవన్ నిర్ణయం కోసం బండారు ఎదురుచూపులు

కొత్తపేట అసెంబ్లీ స్థానాన్ని టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ప్రకటించడంతో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కేడర్ తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఆదివారం రావులపాలెంలో జనసేన నేతలు ఆయనకు మద్దతుగా నిర్వహించిన సమావేశం చివరకు రసాభాసగా ముగిసింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పునరాలోచన చేయాలని కోరారు. అయితే సీటు ప్రకటించిన వెంటనే మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబ సమేతంగా వెళ్లి జనసేన ఇన్‌చార్జి, సోదరుడైన శ్రీనివాస్‌ను కలిసి మద్దతు కోరారు. అంతకు ముందే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బండారు శ్రీనివాస్‌ను కలిసి తనకు సహకరించాల్సిందిగా అభ్యర్థించినట్టు ప్రచారం జరుగుతోంది.

దాట్లకే మల్లాడి మద్దతు... వేచి చూసే ధోరణిలో జనసేన...

టీడీపీ అభ్యర్థిగా ప్రకటితమైన మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)కు అనుకోని అదృష్టం కలిసి వస్తోంది.పుదుచ్చేరి రాష్ట్రంలో కీలక ప్రజాప్రతినిధిగా చెలామణి అయ్యే యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావును దాట్ల సుబ్బరాజు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. దానికి ఆయన నుంచి సానుకూల స్పందన లభించింది. గత ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసిన తాను ఈసారి బుచ్చిబాబుకు మద్దతు ఇస్తానంటూ పరోక్షంగా చేసిన ప్రకటన ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇదిలా ఉండగా జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణను సోమవారం టీడీపీ అభ్యర్థి బుచ్చిబాబు కలిసి మద్దతు కోరారు. ఆ తర్వాత పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పవన్‌కల్యాణ్ తన విషయంలో తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తానని ప్రకటించారు. ముమ్మిడివరం దక్కని పక్షంలో రామచంద్రపురం నుంచి పోటీకి అవకాశమిస్తారని భావిస్తున్నారు.

అమలాపురం జనసేనదే.. కాదు టీడీపీదే...



అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం జనసేనదేనని ఆ పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు సోమవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. అయితే ఎవరికి ఇచ్చినా తాము కట్టుబడి పనిచేస్తామని వ్యాఖ్యానించారు. అమలాపురం సీటును జనసేనకు కేటాయించారని జరుగుతున్న ప్రచారంతో ఆ పార్టీకి చెందిన దళిత నేతలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఇంటి వద్ద అత్యవసరంగా సమావేశమయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాలు జనసేనకు కేటాయించడం సబబు కాదని, ఇతర జనరల్ నియోజకవర్గాలపై దృష్టి పెట్టాలని వారు కోరారు. అమలాపురాన్ని టీడీపీకి కేటాయించకపోతే ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న తామంతా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్సీ నాయకులు ప్రకటించారు. అమలాపురం సీటు విషయంలో టీడీపీ-జనసేన పునరాలోచనచేసి టీడీపీకి కేటాయించాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో కోనసీమలోని దళితులకు టీడీపీ గుర్తింపు ఇవ్వట్లేదని భావించి ప్రత్యామ్నాయం చూసుకుంటామని హెచ్చరించిన సమావేశంలో పొలమూరి ధర్మపాల్, ఈతకోట నాగేశ్వరరావు, మంద గెద్దయ్య, పండు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్ కలేనా!



» ఇదీ కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో పరిస్థితి

» సర్వేలే తప్ప కార్యరూపం దాల్చని వైనం

» ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

» అడ్డుకుంటున్న వ్యాపారులు... వారికి ప్రజాప్రతినిధులు మద్దతు ఇస్తున్నారన్న ఆరోపణలు

రావులపాలెం, ఫిబ్రవరి 26:

కోనసీమ జిల్లా ముఖద్వారమైన రావులపాలెంలో జాతీయ రహదారిపై ఉన్న కళా వెంకట్రావు సెంటరు ఇది. ఈ సెంటరు మీదుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నిలిచిపోయి అటు వాహనచోదకులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు నగరాలు, పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టారు. కానీ రావులపాలెంలో మాత్రం ఫ్లై ఓవర్‌కు సర్వేలు తప్ప నిర్మాణానికి ముందుకొచ్చిన దాఖలాలు లేవు. మరోపక్క ఈ హైవే దాటాలంటే గుండెల్లో గుబులు పుడుతోంది. ఏమాత్రం ఆదమరిచినా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావుడి చేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

చెన్నయ్-కోల్‌కతా మార్గంలో 216 (ఎ) జాతీయ రహదారి రావులపాలెం, ఆలమూరు మండలాల్లో సుమారు 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.



రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్లో నిలిచిపోయిన వాహనాలు (పాత చిత్రం)



వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రావులపాలెంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో ఫ్లై ఓవర్ నిర్మించమని ప్రజాప్రతినిధులు, అధికారులను పరిసర ప్రాంతాల ప్రజలు వేడుకుంటున్నా మొక్కుబడిగా హామీలు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ఫ్లైఓవర్ నిర్మాణ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ కళాశాల నుంచి గౌతమి వంతెన వరకు ఫ్లై ఓవర్ నిర్మించాలని అధికారులు అనేకసార్లు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆలమూరు మండలం జొన్నాడ, రాజమహేంద్రవరం సమీపంలోని మోరంపూడి సెంటరు వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టారు. అదే సమయంలో రావులపాలెంలోనూ ఫ్లై ఓవర్ నిర్మిస్తారని ప్రజలు ఎంతో ఆశపడ్డారు. కానీ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇక్కడ వ్యాపారాలు విస్తరించి ఉండటంతో దుకాణాల యజమానులకు లక్షల్లో అద్దెలు వస్తున్నాయి. ఫ్లై ఓవర్ వేస్తే వ్యాపారాలు దెబ్బతినడంతో పాటు అద్దెలు రూపంలో వచ్చే ఆదాయానికి భారీ గండిపడుతుందని భవన నిర్మాణదారులు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులకు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలు కూడా వున్నాయి. ఏదీ ఏమైనప్పటికీ ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టకపోతే జరిగే ప్రమాదాలకు, పోయే ప్రాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యులు అవుతారని ప్రజలు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు.



ఢీకొట్టి వెళ్లిపోతున్న బస్సు (సీసీ కెమెరా చిత్రం)



ప్రమాదంలో మృతి చెందిన వారు

ఘోరం

లారీ డ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు

అక్కడికక్కడే నలుగురి దుర్మరణం

మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. మరొకరు ఆలయ సేవకుడు

డ్రైవర్లు బాపట్ల జిల్లావాసులు.. మరొకరు స్థానికుడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన

ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు

7లో

'బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ చెప్పొద్దు'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: సైబర్ నేరాలను నిరోధించేందుకు ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ చెప్పొద్దని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఆర్థిక విద్య సందేశాలను విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. బ్యాంకు ఖాతాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సోమవారం ప్రారంభమై మార్చి 1 వరకు నిర్వహించే వారోత్సవాల్లో 'మేక్ ఏ రైట్ స్టార్ట్.. బీకం ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే థీమ్‌పై ప్రచారం చేస్తామన్నారు. విద్యార్థులకు బ్యాంకింగ్ అవసరాలు, డిజిటల్ పేమెంట్లు, సైబర్ నేరాల గురించి తెలియజేసే గోడ పత్రికను ఆవిష్కరించారు.



ఘోరం

లారీడ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

అక్కడికక్కడే నలుగురి మృతి

మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. మరొకరు ఆలయ సేవకుడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన

ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు



బంధువుల రోదన



ప్రమాదానికి కారణమైన బస్సు



సంఘటన స్థలంలో పోలీసులు



నాగయ్య



కిషోర్



ప్రసాద్



లోవరాజు



ఆటోలో మృతదేహాలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26: పంక్చర్ అయిన లారీ టైరు మారుస్తున్న డ్రైవర్లపై మృత్యుశకటంలా ఆర్టీసీ బస్సు దూసుకువచ్చింది. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోగా అమ్మవారి ఆలయ సేవకుడు కూడా మృత్యువాతకు గురయ్యాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగింది. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్యక్ష సాక్షులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురువ మండలం నక్కబొక్కలపాడుకు చెందిన డ్రైవర్ బండి నాగయ్య(26), అదే మండలానికి చెందిన రామాంజనేయపురం గ్రామానికి చెందిన దాసరి కిషోర్(50), దాసరి ప్రసాద్(40) లారీడ్రైవర్లు. వీరు ముగ్గురు దాసరి ప్రసాద్, బండి నాగయ్య ఒక లారీపై, దాసరి కిషోర్ మరో లారీపైన ఒడిసా నుంచి బాపట్లకు హెచ్‌పీ వైర్లు లోడుతో బయల్దేరారు. వీరి రెండు లారీలు ఒకదాని వెంట మరొకరి ప్రయాణిస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి ప్రత్తిపాడు పాదాలమ్మ గుడివద్దకు సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేరుకోగానే వెనుక లారీ టైరు పంక్చర్ అయింది. దీంతో రెండు లారీలు పాదాలమ్మగుడి సమీపంలో రోడ్డు మార్జిన్ వద్ద నిలిపివేసి ముగ్గురు డ్రైవర్లు పంక్చర్ అయిన టైర్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా బస్సును నడుపుతూ టైర్ పంక్చర్ పనులు చేస్తున్న ముగ్గురు డ్రైవర్లపై దూసుకువెళ్లాడు. అదే క్రమంలో పాదాలమ్మ ఆలయం వద్ద గల షెల్టర్ నుంచి బహిర్భూమికి వెళ్తున్న ఆలయ సేవకుడు దివిలి లోవరాజు(29)ను కూడా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు డ్రైవర్లు, ఆలయ సేవకుడు తీవ్ర గాయాలతో సంఘటనాస్థలం వద్దే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఆర్టీసీ బస్సును డ్రైవర్ నిలుపుదల చేయకుండా రాజమహేంద్రవరం తీసుకువెళ్లిపోయాడు. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. నలుగురు వ్యక్తులు రహదారి చెంతనే మృత్యువాత చెందడంతో ఆ ప్రదేశమంతా రక్తపు మడుగులా మారింది. ప్రమాద విషయం తెలిసి పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమార్, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్‌ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్, కిషోర్, స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ నిర్వహించారు. నాలుగు మృతదేహాలను ఆటోలపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఆర్టీసీ బస్సు డ్రైవర్

పాదాలమ్మ గుడి వద్ద నిర్లక్ష్యంగా బస్సు నడిపి నలుగురు మృతికి కారణమైన రాజమండ్రి ఆర్టీసీ డిపోకు చెందిన పిల్లా శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నలుగురు మృతి ఘటన జరిగినా బస్సు డ్రైవర్ పిల్లా శ్రీనివాస్ బస్సును రాజమహేంద్రవరానికి తీసుకువెళ్లిపోయాడు. దీంతో పోలీసులు అతడ్ని రాజమండ్రిలో అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

మిన్నంటిన రోదనలు

పాదాలమ్మ తల్లి గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు వ్యక్తుల కుటుంబీకుల రోదనలతో ప్రత్తిపాడు ఆసుపత్రి కన్నీటిసంద్రంగా మారింది. కుటుంబానికి ఆధారంగా ఉండే లారీడ్రైవర్లు జీవితాలు తెల్లవారుతూనే తెల్లారిపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. బాపట్ల జిల్లా బల్లికురువు మండలం నక్కబొక్కలపాడు, రామాంజనేయపురం లారీ డ్రైవర్ల స్వగ్రామాలు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు బంధువులకు సమాచారం అందించడంతో సోమవారం మధ్యాహ్నానికి ప్రత్తిపాడు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో స్థానికంగా ఉంటున్న దివిలి లోవరాజుది విశాఖపట్నం. ఆరేళ్లుగా స్థానిక పాదాలమ్మ గుడి వద్ద సేవకుడిగా ఉంటూ బహిర్భూమికి వెళ్తూ ఊహించని విధంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. లోవరాజు తల్లి సన్యాసమ్మ, తండ్రి త్రినాథ్, సోదరుడు శివాజీ, సోదరి రమ్యకృష్ణ విలపిస్తున్న కంటతడి పెట్టించింది. మృత్యువాతపడ్డ డ్రైవర్లలో దాసరి కిషోర్, దాసరి ప్రసాద్ అన్నదమ్ములు. వీరి అమ్మ, అక్క, తమ్ముడు కూడా సంవత్సర కాలంలోనే మృతి చెందారు. కిషోర్‌కు భార్య శ్యామల, కుమార్తె అక్షిత, కుమారుడు హర్ష ఉన్నారు. ప్రసాద్‌కు భార్య వరలక్ష్మి, కుమార్తెలు లక్ష్మి, కిరణాంజలి, లిఖిత, ప్రసన్న లక్ష్మి ఉన్నారు. బండి నాగయ్యకు భార్య లిల్లి గ్రేస్, ఏడాదిన్నర కుమార్తె కోమలి, మరో 15రోజులు వయస్సు గల బాబు ఉన్నారు. నాగయ్య ఆకస్మిక మరణంతో అతడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కుప్పకూలిపోయారు.



శ్రీనివాస్ (ఫైల్‌ఫోటో)

చెట్టును ఢీకొన్న కారు

యువకుడి మృతి..డ్రైవర్‌కు గాయాలు

ఎటపాక, ఫిబ్రవరి 26: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి గ్రామానికి చెందిన జాటోత్ శ్రీనివాస్ (23) తన కారులో డ్రైవర్‌తో మారేడుమిల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో బాసవాగు మూలమలుపు వద్దకు రాగనే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాస్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి తెలుగు భాషా సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: తెలుగు భాషా సాహిత్యాలపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 28 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ఎస్‌వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలలో జరుగుతున్న ఈ సదస్సుకు యూనివర్సిటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సమావేశాలకు 2వ అంతర్జాతీయ తెలుగు సమావేశాలుగా నామకరణం చేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగినఈ సమావేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చిందన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన గంధం రాజేష్‌కుమార్-దుర్గాదేవి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,75,356 లభించినట్లు ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుని హుండీల ఆదాయం రూ.41.23 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయాలను సోమవారం లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.40,14,406, గుర్రాలక్కమ్మ వారి హుండీ ద్వారా రూ.80,044, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.29,432, మొత్తం హుండీల ఆదాయం రూ.41,23,882 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.37,822 వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి, అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఎంపీటీసీ భైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్, ఉమెన్-2024 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిసాయి. పురుషుల విభాగంలో విజేతల వివరాలను అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ, రన్నరప్‌గా అమలాపురానికి చెందిన ఎం.వీరేంద్ర నిలిచారు. ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా అమలాపురం, రన్నరప్‌గా రాజమహేంద్రవరం నిలిచాయి. 59 కిలోల విభాగంలో బి.యశ్వంత్ (అమలాపురం), వై.రాజు (రాజమహేంద్రవరం), ఎం.కిరణ్ (రాజమహేంద్రవరం), 66 కిలోల విభాగంలో ఎం.మధుసూదన్ (రాజమహేంద్రవరం), వి.లవకుమార్ (ముమ్మిడివరం), వై.పుత్రరాజు (రామచంద్రపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 74 కిలోల విభాగంలో ఎ.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), పి.జోసఫ్ (రామచంద్రపురం), వి.మహేష్ (ముమ్మిడివరం), 83 కిలోల విభాగంలో ఎం.సాయి (ముమ్మిడివరం), ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), ఎం.వెంకటేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో ఎం.వీరేంద్ర (అమలాపురం), ఎస్.సాయి (అమలాపురం), పి.మోహన్ (ముమ్మిడివరం), 93 కిలోలు పైబడిన విభాగంలో వి.వంశీ (ముమ్మిడివరం), సీహెచ్ వెంకటేష్ (రాజమహేంద్రవరం), డి.వీరమణికంఠ (ముమ్మిడివరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మాస్టర్స్ విభాగంలో 40 నుంచి 50 ఏళ్లలోపు నిర్వహించిన పోటీల్లో డీఆర్కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ), చీకురుమెల్లి కిరణ్‌కుమార్ (అమలాపురం), డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 60 ఏళ్లలోపు విభాగంలో జీఎస్ఎన్ మూర్తి, ఏఎస్ సత్యనారాయణ, ఎల్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) వరుస స్థానాలు సాధించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డీవీ సత్యనారాయణ, దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, జి.గణేష్‌బాబు, యు.లక్ష్మీనారాయణ, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. టీడీపీ యువ నాయకుడు గంధం పల్లంరాజుతో పాటు గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు, డాక్టర్ గంధం విశ్వనాథ్, జయన సత్తిరాజు విజేతలకు బహుమతులు, షీల్డులను సమకూర్చారు. డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో విజేతలకు వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ ఆధ్వర్యంలో ప్రముఖులు దున్నాల దుర్గ, నల్లా సంజయ్, ఆర్డీఎస్ ప్రసాద్, కల్వకొలను ఉమా, మోకా వెంకటసుబ్బారావు, ఆశెట్టి ఆదిబాబు బహుమతులు అందజేశారు.

బంగారు దొంగలను పట్టేశారు

సినీ ఫక్కీలో దొంగతనం.. కేసులో మొత్తం 12 మంది నిందితులు

ఐదు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

9 మంది అరెస్టు.. 3.50 కిలోల బంగారం రికవరీ



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను మీడియాకు చూపిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కేటుగాళ్లు సినీ ఫక్కీలో భారీ దొంగతనం చేస్తే.. తూర్పుగోదావరి జిల్లా పోలీసులు తమదైన రూటులో వెళ్లి కేవలం ఐదు రోజుల్లో ఆటకట్టించారు. ఈ మేరకు ఎస్పీ జగదీశ్ వివరాలను వెల్లడించారు. భీమవరానికి చెందిన బాలు నాథూరామ్ బంగారం షాపుల నుంచి వచ్చే ఆర్డర్ల ప్రకారం ఆభరణాలను సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 21న తన కారులో ఆభరణాలు షాపులకు ఇవ్వడానికి దూబచర్ల, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం బయలు దేరారు. చీకటి పడుతున్న సమయంలో కొయ్యలగూడెం దాటిన తర్వాత ఇన్నోవాలో ఐదుగురు దుండగులు వచ్చి తాము ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నాథూరామ్‌ని ఆపారు. బాలును, డ్రైవరు సురేశ్‌ని తమ కారులో ఎక్కించుకున్నారు. ఐదుగురిలో ఇద్దరు దుండగులు నాథూరామ్ కారులో బయలుదేరారు. రాజమహేంద్రవరం దగ్గరలోని దివాన్ చెరువు, లాలాచెరువు ప్రాంతాలు తిప్పి నాలుగో వంతెన సమీపంలోని జీరో పాయింట్ వద్ద నాథూరాంను దించేసి ఆయన కారును అప్పగించి దుండగులు పరారయ్యారు. కారులోని 3.50 కిలోల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైందని గమనించి నాథూరాం పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో దోపిడీ నల్లజర్ల పోలీస్ స్టేషను పరిధిలో జరిగినట్టు గుర్తించి ఆ స్టేషనులో కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. దర్యాప్తులో కొందరు అనుమాస్పద వ్యక్తులు ఇన్నోవాలో విజయవాడ వైపు వెళ్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. కారులోని వాళ్లను ప్రశ్నించిన అనంతరం 12 మందిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ వివరించారు. వీళ్లలో జంగారెడ్డిగూడెంకు చెందిన చలపాక వెంకటేశ్, మద్దిపాటి కల్యాణ్, కోడూరి రవితేజ, కోనా శ్రీనివాస్, వేముల మంజుబాబు, షేక్ నాగూర్ మీరావలి, వేముల మోహన్ సాయి, మోహన్ నారాయణ్ కుంబాకర్, పమిడిపల్లి బ్రహ్మాజీలను అరెస్టు చేశామన్నారు. వీరందరూ పాత నేరస్తులని, నగల వ్యాపారం చేసేవాళ్లు, తయారీ దారులు కూడా ఉన్నారన్నారు. పథకం ప్రకారం దోపిడీకి దిగారన్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 181 బంగారు గొలుసులు, కరిగించిన బంగారు కడ్డీలు మొత్తం 3.50 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, నల్లజర్ల సీఐ కె.దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు కె.రజనీకుమార్, కె.విజయబాబు, ఉమామహేశ్వరరావు, దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరి, టీవీ సురేశ్, ఐటీ కోర్ ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి తదితర సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

వారం రోజుల్లోగా ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

లేకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం

పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం



విలేకర్లతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26: మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వారం రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఫిషర్‌మెన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం జారీ చేశారు. కాకినాడలోని కాస్మోపాలిటిన్ క్లబ్ హాల్‌లో సోమవారం ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ నెల 17న మాజీ ఎమ్మెల్యే కొండబాబును విమర్శిస్తూ మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు .అప్పటి నుంచి మత్స్యకారులు పలు విధాలుగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ద్వారంపూడి వైఖరిలో మార్పు రాలేదన్నారు. ద్వారంపూడి ఈ వ్యాఖ్యలు చేసి పది రోజులవుతున్నా ఇప్పటివరకు మత్స్యకార జాతికి క్షమాపణ చెప్పకపోవడం పట్ల ఆయన అహంకార వైఖరి అర్థమవుతోందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ విద్యాసంస్థలు, అంతర్వేది దేవాలయాలు కట్టించిన దాతలు నాయకర్, కృష్ణమ్మలు మత్స్యకార జాతికి చెందినవారేనని తెలుసుకోవాలన్నారు. మత్స్యకార నాయ కులు సైకం రాజశేఖర్, బర్రి ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కాకినాడలో మత్స్యకారుల సమా వేశానికి ఆటంకాలు కలిగించి ద్వార ంపూడి గడ్డపారతో తన గొయ్యి తానే తవ్వుకున్నాడని, ఇప్పుడు పూర్తిగా ఆ గొయ్యిలో కూరుకుపోయాడన్నారు. ఆయన ఓట్ల ప్రచారానికి వచ్చి నప్పుడు మత్స్యకారులు ఇంటి తలుపులు వేసుకుని నిరసన తెలపాలన్నారు. గతంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను కూడా అవమానపరచిన నీచ చరిత్ర అతనికి ఉందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బలసాడి ఇందిర, మత్స్యకార నాయకులు మల్లాడి రాజు, తుమ్మల సునీత, తుమ్మల రమేష్, కోలా ప్రసాదవర్మ, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, బొడ్డు సత్యనారాయణ, పినపోతు తాతారావు, మల్లాడి రాజేంద్రప్రసాద్, కర్రి చిట్టిబాబు, చోడిపల్లి సతీష్, బడే కృష్ణ, బాలిపల్లి రాజు, గంటా వెంకటలక్ష్మి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిపాకలో మహా రుద్రాభిషేకం ప్రారంభం



పీఠాధిపతి శివస్వామితో జ్యోతుల నెహ్రూ, వనమాడి

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 26: జగ్గంపేట మండలం ఇరిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం కార్యక్రమాన్ని సోమవారం అమరావతికి చెందిన శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివ స్వామి ప్రారంభించారు. ముందుగా జ్యోతుల నెహ్రూ‌రామణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులతో పాటు 24జంటలు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షా బంధం, పంచగవ్య ప్రాసన, దీక్షా ధారణ, గోపూజ, వేద పారాయణం, యాగశాల ప్రవేశం మహాన్యాస పారాయణ జ్యోతిర్లింగాల ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, సాయంత్రం సౌరాష్ట్ర సోమనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ ఇంతటి మహత్తర కార్యక్రమం నిర్వహించాలంటే ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ 11 రోజుల పాటు ఈ మహాకుంభాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కోటి మట్టి శివలింగాలకు భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకం చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ హరీష్ బాలయోగి, చిక్కాల రామచంద్రరావు, వనమాడి కొండబాబు, కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా తాతాజీ, జిల్లాలోని, నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అమృత్ భారత్ పథకంతో రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలను సమూలంగా మార్చేందుకు అమృత్ భారత్ పథకానికి ఎంపిక చేసిన ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కోసం రైల్వే అధికారులు రైల్వే స్టేషనులో ప్రత్యేక వేదిక, స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను ఆధునీకీకరించే దిశగా ప్రధాని మోదీ చర్యలు చేపట్టడం స్వాగతనీయమన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఫైవ్‌స్టార్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రైల్వే స్టేషనుగా మారబోతోందన్నారు. గోదావరిపై మరో వంతెనకు రైల్వే వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. విశాఖ-విజయవాడ నడుమ మూడో లైను వేస్తున్నారని, నాలుగోలైను ఆవశ్యకత కూడా ఉందన్నారు. వికసిత్ భారత్, వికసిత్ అమృత్ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏడీ ఆర్ఎం డి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.ప్రసాద్, సమన్వయకర్త సీసీఐ కల్యాణ్ కుమార్, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఐవోడబ్ల్యూ ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, ఎస్ఎస్ఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో వైభవంగా శ్రీపుష్పోత్సవం



ద్రాక్షారామ: ఫిబ్రవరి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.05 భీమేశ్వరుని శ్రీపుష్పోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణ మూర్తులను పుష్పాలు, చందన, కర్పూరాలతో అలంకరించారు. అనంతరం తూగుటుయ్యాలపై ఉంచి ఊయలాడించారు. పూజాధికాలు ఆస్థాన బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకస్వాములు, వేదపండితులు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంపూర్ణ విద్య అందించే విద్యా విధానం అవసరం

ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) మహాసభల్లో వక్తలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని, ప్రతి విద్యార్థికి సంపూర్ణ విద్య అందేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) 3వ రాష్ట్ర మహాసభ సోమవారం స్థానిక పిల్లా మరియమ్మ ప్రాంగణంలో విజయవంతంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, మాజీ శాసనమండలి సభ్యురాలు అంగులూరి లక్ష్మీశివకుమారి, పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు ఎస్.కొండబాబు హాజరయ్యారు. విద్య-వైద్య రంగాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు అన్ని వసతులు పూర్తి స్థాయిలో కల్పించి విద్యను సంపూర్ణంగా ఉచితంగా అందించడంతో పాటు సన్న బియ్యంతో ఆహారం, కాస్మొటిక్స్ అందించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం డీఎస్సీ ద్వారా శాశ్వత ఉపాధ్యాయులను ప్రతీ స్కూల్‌లో నియమించాలన్నారు. అనంతరం డాక్టర్ పిల్లా చంద్రం నూతన అధ్యక్షునిగా 41 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ అధ్యక్షుడు పిల్లి శివకుమార్, గిరిజన హక్కుల సాధన సంఘం కన్వీనర్ బి.విప్లవకుమార్, కెవీపీఎస్ జిల్లా నాయకులు కె.సింహాచలం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, కనకరాజు, తణుకుల యోహన్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాయవరం, ఫిబ్రవరి 26: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని తహశీల్దారు కృష్ణారావు పిలుపునిచ్చారు. సోమవారం రాయవరం వెలుగు కార్యాలయంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దారు మాట్లాడుతూ ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యం, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో నాజర్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- చంద్రబాబు, పవన్ సభకు తరలివెళ్లాలి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నినాదాలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

కొత్తపేట, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకురావడానికి టీడీపీ-జనసేన కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీల కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానికఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సత్యానందరావు మాట్లాడుతూ బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే ఇరు పార్టీల ఉమ్మడి సమావేశానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని కోరారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జనసేన నాయకులు పల్లి శాంతి, చిక్కం శివాజీనాయుడు, డీఎస్పీ నాయుడు, బాబి, వాకాడ శ్రీను, సాయి, చోడపనీడి సూరిబాబు, బండారు గంగరాజు, బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీను, కేతా శ్రీను, రెడ్డి శ్రీను, గుత్తుల పట్టాభిరామారావు పాల్గొన్నారు.

జనసేన అధినేత ఆదేశాలే శిరోధార్యం

కొత్తపేట, ఫిబ్రవరి 26: కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి విజయానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలే తమకు శిరోధార్యమని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. కొందరు వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జనసేనలో ఉంటూ పవన్‌ను విమర్శిస్తే ఊరుకోబోమన్నారు. ఆయన రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షించి వైసీపీ రహిత పాలనకు సిద్ధపడ్డారని, దానికి తామంతా మద్దతుగా ఉంటామన్నారు. ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషిచేస్తామని నినాదాలు చేశారు. జనసేన అమలాపురం పార్లమెంట్ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి చిక్కం శివాజీనాయుడు, అవిడి గ్రామ శాఖ అధ్యక్షుడు అడపా ఆనంద్, జనసేన నాయకుడు చోడపనీడి సూరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాతాలో ఓఎన్జీసీ పరిహారం జమ

యానాం, ఫిబ్రవరి 26: యానాం మత్స్యకారుల కోసం ఓఎన్జీసీ సంస్థ నుంచి రూ.68.09కోట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. 15నెలలకు రూ.91.23కోట్లుఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వఖాతాతో రూ.23.14కోట్లు ఉన్నందున మిగిలిన రూ.68.09కోట్లు ఓఎన్జీసీ జమ చేసిందన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ పరంగా తీసుకోవలసిన చర్యలపై సీఎం రంగసామి, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, కార్యదర్శి, డైరెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడినట్లు మల్లాడి చెప్పారు. దీంతో సీఎం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. మంగళవారం పుదుచ్చేరి వెళ్లి మూడు రోజుల్లో 5,289మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయిస్తానన్నారు.

విద్యా హక్కు చట్టం అమలుపై ప్రచారం

అంతర్వేది, ఫిబ్రవరి 26: సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలన్నీ విద్యా హక్కు చట్టంపై విద్యాశాఖాధికారి డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. 2009 సెక్షన్12(1)సి ప్రకారం స్టేట్ సిలబస్ అమలు చేయాలని, 25శాతం ఉచిత సీట్లు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో కిశోర్‌కుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో బడుగు మంగాదేవిలకు సమాచార పత్రాలు అందించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఉచిత సీట్లపై అవగాహన కల్పించారు. అర్హులైన 25 ఉచిత సీట్లకు నేరుగా, వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అయినవిల్లి, ఫిబ్రవరి 26: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు సందర్శించారు. సోమవారం కుటుంబ సమేతంగా శ్రీసిద్ధివినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 26: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై మహిళలకు అవగాహన ఉండాలని డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు అన్నారు. అయినవిల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సోమవారం డ్వాక్రా మహిళలకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వారా, డీఆర్డీఏ ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విహారి, మండల సమైఖ్య అధ్యక్షురాలు బి.శాంతి, పి.ప్రశాంతి, సత్యదేవి, ఎం.దుర్గ, భవానీ పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

అల్లవరం, ఫిబ్రవరి 26: ప్రభుత్వఉద్యోగులుబాధ్యతగా విధులు నిర్వర్తించి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని అమలాపురం నూతన డీఎల్‌డీవో ఎస్వీ రాజేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో మండలంలో అభివృద్ధిపై సోమవారం సమీక్షించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అల్లవరం మండలం అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఏవో బి.లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు ఎ.శ్రీరామచంద్రమూర్తి, చిక్కం శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, ఎస్.రాజమోహన్ పాల్గొన్నారు.

16న జాతీయ మెగా లోక్ అదాలత్

రాజోలు, ఫిబ్రవరి 26: మార్చి16న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాల్సిన కేసులను పరిష్కరించుకోవాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. స్థానిక కోర్టు భవనాల సముదాయంలో రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు, ఎస్ఐ జి.పృధ్వీతో సోమవారం సమావేశం నిర్వహించారు. జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు.

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిపై ఫిర్యాదు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 26: మహిళా సమాఖ్య రామచంద్రపురం మండల అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య ఆసరా సభలకు సొమ్ములు చెల్లించక పోవడంపై గ్రామసంఘాల సభ్యులు సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. బైలాకు వ్యతిరేకంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా లావణ్య దీర్ఘకాలం కొనసాగుతున్నారన్నారు. ఇటీవలఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీపీ అంబటి భవానీ ఆధ్వర్యంలో ఆసరా సభలు నిర్వహించగా, అందుకైన ఖర్చులు రూ.2లక్షలు మండల మహిళా సమాఖ్య నుంచి చెల్లించాలని అధికారులు ఆదేశించినా చెల్లించలేదన్నారు.

వచ్చే ఏడాది నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సు

యానాం, ఫిబ్రవరి 26: యానాంలోని మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలలో వచ్చే ఏడాది నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సు అందుబాటులోకి రానుందని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.7కోట్లు కేటాయిస్తు ఉత్తర్వులు జారీచేసిందన్నారు. కొత్త భవనం కట్టే వరకు ప్రభుత్వ పాఠశాలలో తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిఏడాది 30మంది విద్యార్థులు ఈకోర్సులో చెరేందుకు యానాం నుంచి పుదుచ్చేరి వెళ్తున్నారన్నారు. వచ్చే ఏడాదినుంచి ఆ పరిస్థితి ఉండదన్నారు.

మాదిగలకు సీటు కేటాయించకపోతే పోటీ

పి.గన్నవరం, ఫిబ్రవరి 26: రిజర్వ్‌డ్ స్థానాల్లో మాదిగలకు సీటు కేటాయించకపోతే మూడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీట్లకు స్వతంత్ర అభ్యర్థులను పోటీకి దింపుతామని మాదిగల రాజకీయ జేఏసీ చైర్మన్ చుట్టుగుళ్ళ నీలకంఠం అన్నారు. ముంగండలో జరిగిన మాదిగల రాజకీయ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు సీట్లు కేటాయించిన రాజకీయ పార్టీకే ఉమ్మడి జిల్లాలో ఉన్న మాదిగలందరూ మద్దతు పలుకుతారన్నారు. రాజకీయ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి ఆశీర్వాదం, చిన్న, ఉందుర్తి సుబ్బారావు, గంపల సత్యప్రసాద్, ఆకుమర్తి శ్రీను, సీహెచ్ శ్రీను, ఈతకోట సత్యనారాయణ, మల్లవరపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సంయమనం పాటించాలి: బాలకృష్ణ



మాట్లాడుతున్న జనసేన పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బాలకృష్ణ మాట్లాడారు. పవన్‌కల్యాణ్ గతంలో ఇచ్చిన మాట మేరకే ముమ్మిడివరం నియోజకవర్గ టిక్కెట్ తనకే వస్తుందనే దీమాతో ఉన్నానన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ కులస్తులు అధికంగా ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల మంది తమ సామాజిక వర్గానికి చెందిన వారున్నారన్నారు. పొత్తులో భాగంగా శెట్టిబలిజ కులస్తులకు సీటు కేటాయించాల్సిన బాధ్యత ఇరుపార్టీలపైనా ఉందన్నారు. తాను పార్టీ నాయకులు పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌లను కలిశానన్నారు. 28న తాడేపల్లిగూడెంలో జరిగే బహిరంగ సభ అనంతరం మార్చి 2, 3 తేదీల్లో తనకు టిక్కెట్ ఇచ్చే విషయంపై చర్చించి న్యాయం చేస్తామని నాదెండ్ల భరోసా ఇచ్చారన్నారు. అంతవరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించాలని, తనకు న్యాయం చేస్తారని పూర్తి విశ్వాసంలో ఉన్నానని, తనకు న్యాయం జరగకపోతే కార్యకర్తలు తీసుకునే నిర్ణయమే శిరోధారమన్నారు. సమావేశంలో సానబోయిన మల్లికార్జునరావు, మోకా బాలప్రసాద్, కడలి వెంకటేశ్వరరావు, దూడల స్వామి, పితాని రాజు, గిడ్డి రత్నశ్రీ, ఓగూరి భాగ్యశ్రీ, లంకలపల్లి రాణి, సానబోయిన వీరభద్రరావు పాల్గొన్నారు.

బాలకృష్ణకు జిల్లాలో ఏదో స్థానం కేటాయించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి26: జనసేన పార్టీకి ఆరేళ్లుగా ఎనలేని సేవలందిస్తూ వస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణకు జిల్లాలో ఏదోఒక స్థానం కేటాయించి పార్టీ అధిష్టానం న్యాయం చెయ్యాలని జనసేన సమావేశం కోరింది. ముమ్మిడివరంలో సోమవారం రాత్రి జరిగిన జనసేన సమావేశంలో తీర్మానించారు. జనసేన-టీడీపీ పొత్తులో భాగంగా ముమ్మిడివరం అసెంబ్లీ సీటును టీడీపీకి కేటాయించడంపై చర్చ జరిగింది. పార్టీ అభ్యున్నతికి పాటుపడిన బాలకృష్ణకు సీటు కేటాయింపును పరిశీలనకు తీసుకోకపోవడం సరికాదని నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేశారు. ఒక దశలో బాలకృష్ణ, వీరమహిళలు కంటతడి పెట్టారు. బాలకృష్ణమాట్లాడుతూ విజయవాడ పార్టీ కార్యాలయానికి వెళ్లి పవన్‌కల్యాణ్ కలిసేందుకు ప్రయత్నించగా నాదెండ్లకు బాధ్యతను అప్పగించామన్నారు. మార్చి ఒకటి తర్వాత మరో నియోజకవర్గంలో టికెట్ ఇచ్చేనిర్ణయం తీసుకుంటామన్నారు. సానబోయిన మల్లికార్జునరావు, దూడల స్వామి, మద్దింశెట్టి పురుషోత్తం, మోకా బాలప్రసాద్, అత్తిలి బాబూ రావు, జక్కంశెట్టి పండు, మాదాల శ్రీధర్, ఓగూరి భాగ్య శ్రీ, బద్రి రమణ, గిడ్డి రత్నశ్రీ, లంకలపల్లి రాణి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టీడీపీ, జనసేన సభకు తరలిరావాలి



ద్రాక్షారామ, ఫిబ్రవరి 26: తాడేపల్లిగూడెంలో ఈనెల28న తెలుగుదేశం, జనసేన బహిరంగ సభకు టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలుతరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. సోమవారం చోడవరం బైపాసు రోడ్డులో రెడ్డి సుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద జరిగిన నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

టీడీపీ టికెట్ రెడ్డి సుబ్రహ్మణ్యంకు కేటాయించాలి: సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, బీసీ సెల్ నాయకుడు రాయుడు లీలాశంకర్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి మాట్లాడారు. నియోజకవర్గంలో మూడున్నరేళ్లుగా రెడ్డి సుబ్రహ్మణ్యం టీడీపీకి జవసత్వాలు కల్పించేందుకు ఎంతో శ్రమించారన్నారు. ఆయనకే పార్టీ టిక్కెట్ కేటాయించాలని, లేకపోతే తమ పదవులకు రాజీనామాలు చేస్తామన్నారు. ప్రముఖ రేడియాల జిస్టు, టీడీపీ నాయకుడు డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ జరిగిన పరిణామలు, కార్యకర్తల మనోభావాలు, ఆవేదన తెలుసుకుని పార్టీ కోసం మూడేళ్లుగా నిజాయితీగా పనిచేసిన రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ టిక్కెట్ ఇవ్వాలని కోరారు. కొత్తవారికి అవకాశం ఇస్తే పార్టీ టిక్కెట్ తనకు కేటాయించేందుకు సిఫార్సు చేయాలని రెడ్డి సుబ్రహ్మణ్యంనుకోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 26: కోరుమిల్లిలో రూ.25లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, ఆచంట స్వామి, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చౌక డిపో డీలర్ల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావు

మలికిపురం, ఫిబ్రవరి 26: ఆహార భద్రతా చట్టం, పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ నిబంధనల ప్రకారం డీలర్లతోనే చౌక ధరల దుకాణాల వద్దే ప్రజలకు నేరుగా రేషన్ పంపిణీ చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు డిమాండు చేశారు. సోమవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన జిల్లా చౌకడిపో డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విధానంతో రాష్ట్రంలోని 29,500మంది డీలర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం డీలర్ల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రేషన్ డీలర్లకు సంక్షేమ పథకాల అమలుకు జారీచేసిన జీవోను అమలు చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రామీణప్రాంతాల్లోని డీలర్లకు రూ.7500, పట్టణ ప్రాంతాల్లోనిడీలర్లకు రూ.10వేలు గౌరవవేతనం ఇవ్వాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానంతో డీలర్లు వారి కుటుంబాలు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయని ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. జిల్లా అధ్యక్షుడు అడపా వెంకటరమణ, దొమ్మేటి ఏడుకొండలు, కేవీఎస్ ప్రసాద్, జి.సుబ్బారావు, పెంకే సత్యనారాయణ, అన్నపూర్ణా, పి.పెద్దిరాజు, జి.రామారావు, బాలయోగి, బండారు సూర్యనారాయణ, జిల్లాలోని డీలర్లు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు

మామిడికుదురు, ఫిబ్రవరి 26: అర్హులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తుందని ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కొండేటి చిట్టిబాబు, ఈదరాడలో రాపాక రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు సోమవారం అందించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కె.వనజాకుమారి, ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ మేరీకమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పడమరఖండ్రికలో బాబు ష్యూరిటీ..

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి26: పడమరఖండ్రికలో రెండో రోజు సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా తిరిగి మినీ మేనిఫెస్టోలో పొందుపర్చిన పథకాలు, వాటి ద్వారా కుటుంబానికి చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఓటుతో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఆయన కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం, ఫిబ్రవరి26: రామచంద్రపురం సబ్‌స్టేషన్‌లో ఫీడర్-1, ఫీడర్-2లలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9నుంచి ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ కె.విజయానంద తెలిపారు. మెయిన్‌రోడ్,రత్నంపేట, గుబ్బలవారిపేట, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి రోడ్, లలితానగర్, వీఎస్ఎం కాలేజి, గవర్నమెంట్ హాస్పిటల్, మోడరన్‌కాలేజీ, రామకృష్ణసెంటర్, బ్రాడీపేట, మార్కెట్‌సెంటర్, గాంధీ హాస్పిటల్, కమ్మవారి సావరం, మధ్యనగర్, ఆర్డీవో కార్యాలయం, కవలవారి సావరానికి సరఫరా ఉండదన్నారు.

సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం మూడో రోజు సోమవారం అమ్మవారి ఆలయం వద్ద గణపతిపూజ, మహాకుంభాభిషేకం, చండీహోమం, రుద్రహోమం, కుంకుమ పూజ నిర్వహించారు. వేదపండితులు బాదంపూడి ప్రసాదశర్మ మంత్రోచ్ఛారణల నడుమ వేదపండితులు పూజలు నిర్వహించారు. మహిళలు పవిత్ర జలాలను కలశలతో సేకరించి తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మహాకుంభాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

పాశర్లపూడిలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

మామిడికుదురు, ఫిబ్రవరి 26: పాశర్లపూడిలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. త్రివర్ణ స్నానం, పూర్ణాహుతి, రత్నాన్యాసం, శాంతి కల్యాణం తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం నిధులు రూ.లక్ష, భక్తుల విరాళాలు రూ.9లక్షలతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భారీ అన్నసమారాధన జరిగింది.

కళలను ప్రోత్సహించండి

రామచంద్రపురం, ఫిబ్రవరి 26: కళలను ప్రోత్సహించి కళాకారులను గుర్తించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అన్నారు. భరతముని జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నుంచి 400 మంది నృత్య విద్యార్థులతో 15గంటల పాటు ఆరాధనోత్సవాలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ వీణామూర్తివిజయ్, రామచంద్రపురానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు పసుపులేటి వీరభద్రరావులను నాట్య కళా సమైక్య సభ్యులు, శ్రీలలితా నృత్యనికేతన్ సంస్థ డైరెక్టర్ లలితా నాయుడు సత్కరించారు. విద్యార్థినుల నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైసీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, సన్‌షైన్ సురేష్, వికాస్ రమణ, వివేకానంద కరెస్పాండెంట్ బి.ఎ.ఎస్.సరోజినీ, గురుదేవ్ స్కూల్ కరెస్పాండెంట్ మణిమాల ప్రభు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'ఏ కులం రాజకీయ పార్టీని శాసించలేదు'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: ఏ కులం కూడా రాజకీయ పార్టీని శాసించలేదని, అన్ని కులాలను కలుపుకుని సమష్టిగా సకల జనుల శ్రేయస్సు కోసం ముందుకు వెళ్లే రాజకీయ పార్టీలే మనుగడ సాగిస్తాయని జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు పేర్కొన్నారు. ఒక కులం వారికి సీటు ఇస్తే చెయ్యం, ఆ పార్టీ వారికి ఇవ్వకూడదని చెబితే వినేవారు ఎవరూ ఉండరని పేర్కొన్నారు. పొత్తు ధర్మంలో సమిష్టిగా ముందుకు సాగాలని సూచించారు. అమలాపురం సీటు టీడీపీకి ఇస్తే తామంతా మనస్ఫూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో జెండా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 28న తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చిక్కాల సతీష్, సూదా చిన్నా, మహాదశ నాగేశ్వరరావు, చిక్కం భీముడు, ఆకుల బుజ్జి, సందాడి శ్రీను, గండి మణికంఠ స్వామి, మోకా బాలయోగి, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య

రామచంద్రపురం, ఫిబ్రవరి 26: వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తూరు టిడ్కోగృహాలకు చెందిన ఎలుగుబంటి భూలక్ష్మి (28)కి తరచూ పిట్స్ వస్తున్నాయి. కొంతకాలంగా చికిత్స పొందుతుంది. మానసిక వ్యధతో బాధపడుతున్న ఆమె సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి పసుపులేటి శారద ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్‌బాబు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: కులం పేరుతో దూషించిన జనసేన పార్టీ అయినవిల్లి మండల అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని విశ్వజన కళామండలి జిల్లా సమావేశం డిమాండు చేసింది. ముమ్మిడివరంలో జిల్లా అధ్యక్షుడు గెడ్డం శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగిన విశ్వజన కళామండలి జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు మాట్లాడారు. రాజేష్‌ను కులం పేరుతో మద్దాచంటిని దూషించడం హేయమైన చర్య అన్నారు. దాసరి సత్యనారాయణ, గంటి సత్యనారాయణ, సబ్బతి రాంబాబు, గిడ్డి వరప్రసాద్, బూసి సత్యనారాయణ, పినిపే వీరవెంకటమహీపతిశాస్త్రి, రేవు శ్రీను పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: సుందరం మాస్టర్
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: సిద్ధార్థరాయ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ముఖ్య గమనిక
రమా	: గుంటూరు కారం
గణపతి	: ఐ హేట్ లవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఊరుపేరుభైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు మాకొద్దని ఏడీఏకు రైతుల వినతి



అంబాజీపేట, ఫిబ్రవరి 26: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వ్యవసాయ స్మార్ట్ విద్యుత్ మీటర్లు మాకొద్దంటూ రైతు సంఘ నాయకులు విద్యుత్ శాఖ ఏడీఏ జి.అన్నవరంకు తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద వ్యవసాయ రైతులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు 9గంటలు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీంతో రైతులకు ప్రయోజనంగా లేని స్మార్ట్ మీటర్లు మాకు వద్దంటూ ఏడీఏకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో టీకేఎస్ నాయకులు ముత్యాల జమీలు, దొంగ నాగేశ్వరరావు, రైతు సంఘ ప్రతినిధులు కొర్లపాటి కోటబాబు, పొట్టుపోతు స్వామినాయుడు, గుంటూరి మురళీకృష్ణంరాజు, మేడిద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీకి రెండు రిజర్వ్‌డ్ స్థానాలు కేటాయించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: జిల్లాలో 3రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానాల్లో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించినందున మిగతా 2స్థానాలు టీడీపీకి కేటాయించాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ అవలంభిస్తున్న దళిత వ్యతిరేక విధానాలతో దళితులంతా విసిగివేసారి పోయారని, ఎన్నికల్లో వారంతా టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కార్యవర్గం ఎన్నిక

కె.గంగవరం, ఫిబ్రవరి 26: పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నికైన రెవ. పి.ఆశీర్వాదం మాట్లాడుతూ మండలంలోని పాస్టర్స్ అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. పాస్టర్స్‌కు ఫెలోషిప్ అండగా ఉంటుందన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 26: ఎస్.యానాంలో రూ.5కోట్ల అభివృద్ధి పనులను మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దంగేటి కొండయ్య కుమారులు సమకూర్చిన స్థలాల్లో నిర్మించిన సామాజిక భవనాలతో పాటు సచివాలయ భవనం, రెండు అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాలు, పశువుల ఆసుపత్రి, అంగన్వాడీ భవనాలను ప్రారంభించారు. సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ జోగి రాజేశ్వరీ రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, నీటి సంఘం మాజీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పొగాకు శ్రీను, లంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నామనకు ప్రముఖుల పరామర్శ

మామిడికుదురు, ఫిబ్రవరి 26: సతీ వియోగంతో బాధపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును సోమవారం పలువురు ప్రముఖులు పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఆయన సతీమణి కృష్ణవేణి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పాముల రాజేశ్వరిదేవి, మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చిమహేశ్వరరావు, నాయకులు ఆకుల రామకృష్ణ, యాళ్ల దొరబాబు, మంగెన భూదేవి, మద్దాల పెద్దకాపు, గుండుబోగుల పెద్దకాపు, తోరం భాస్కర్, కొనుకు నాగరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. మూల్‌నివాసీ సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయినాల కృష్ణారావు ఆమె మృతికి సంతాపాన్ని తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి ఉత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి 26: గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారిపాలెంలో వేంచేసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వీరభద్రుడిని కౌశికా నదీ తీరానికి తీసుకు వెళ్లి అక్కడ ఉన్న శ్రీవీరేశ్వరస్వామి, కేశవస్వామివార్ల ఆలయ ప్రాంగణంలో వీరభద్రుడి ప్రతిమలకు పూజలు నిర్వహించారు. స్వామివార్లను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ వద్ద అన్నసమారాధన నిర్వహించారు. తీన్‌మార్, శక్తివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అబ్బులుకు మెడల్

ఆలమూరు, ఫిబ్రవరి 26: అమలాపురంలో జరిగిన ఉభయ గోదావరి జిల్లాల మాస్టర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కలవచర్ల వీఆర్వో టి.అబ్బులు కాంస్య పతకం సాధించాడు. అతడిని పలువురు అభినందించారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, ఫిబ్రవరి26: రాజమహేంద్రవరంలో విశ్వంటెక్ ఆధ్వర్యంలో అబాకస్, వేదిక్‌మేథ్స్ జోనల్ స్థాయిలో నిర్వహించిన కాంపిటేషన్స్‌లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మేథ్స్ సీనియర్స్‌లో ఎ.భానుప్రకాష్ ప్రథమ, అబాకస్ జూనియర్స్‌లో ఎస్.హాసినీదుర్గ ప్రథమ, జి.సంతోష్‌కుమార్ కన్సొలేషన్ బహుమతులు సాధించారు. సోమవారంవారిని డైరెక్టర్ కె.ముల్లారావు, ప్రిన్సిపాల్ ప్రమోద్‌లాల్‌అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ విజేత సుభద్ర

మలికిపురం, ఫిబ్రవరి 26: ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో ఆదివారం అమలాపురంలో జరిగిన పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ విభాగంలో మలికిపురం డిగ్రీ కళాశాలకు చెందిన గోడి సుభద్ర ప్రథమ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ తోరం సతీష్ తెలిపారు. సోమవారం కళాశాలలో కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి, పీడీకే ప్రసాద్ ఆమెను అభినందించారు.

టీడీపీలో పలువురి చేరిక

మండపేట, ఫిబ్రవరి 26: ఇప్పనపాడుకు చెందిన పలువురు సోమ వారం గ్రామానికి చెందిన చోడే అప్పారావు(పెద్దకాపు) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సాంబత్తుల శ్రీను, కోడూరి రత్తయ్య, కురుపూడి అప్పారావు, దుళ్లమందు ఇళ్ల శ్రీను, మురళీ మదు తదితరులు పార్టీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీఎంస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, రిమ్మలపూడి వాసు, ఇళ్ల గంగరాజు, పల్లి అప్పన్న పాల్గొన్నారు.

29నుంచి చింతలూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలమూరు, ఫిబ్రవరి 26: నిత్య వైకుంఠ ద్వారంగా పేర్గాంచిన చింతలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల29 నుంచి మార్చి 4వరకు వేదపండితుడు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. 29న శేష, మార్చి 1న గరుడ, 2న గజ, 3న హనుమద్, 4న కల్పవృక్ష, ముత్యాల పందిరి వాహనాలపై గ్రామోత్సవాలు జరుగుతాయి.

ఇమామే జమానా అవతరణ దినోత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 26: ముస్లిం ఆరాధ్య దైవం, చివరి ప్రవక్త ఇమామేజమానా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం రాత్రి నగరంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ముస్లింలు కల్కిభగవాన్‌ను ఆరాదిస్తారు. కార్యక్రమంలో భాగంగా హుజత్తియా భవనం నుంచి జమానా వాహనమైన ఓడను తీసి ఊరేగించారు. పూర్వీకుల ఆత్మశాంతిని కోరుతూ వారి సమాధుల వద్ద ప్రార్థనలు చేసి బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. మామిడికుదురులోని బాషు పంజాలో జరిగిన మిలాద్‌లో పలువురు ఉర్దూ కవులు తమ కవితల ద్వారా ఆయన మహిమలను వివరించారు. ఊరేగించిన ఓడను నగరం పీర్ల చెరువులో విడిచిపెట్టారు.

తాడేపల్లిగూడెం సభను విజయవంతం చేయాలి

మలికిపురం, ఫిబ్రవరి 26: తాడేపల్లిగూడెంలో ఈనెల28న చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జనసేన, టీడీపీ కార్యకర్తలు విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద జరిగిన జనసేన, టీడీపీ కూటమి సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. రాజోలు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు వెళ్లాలని తీర్మానించారు. గుండుబోగుల పెదకాపు, దేవ వరప్రసాద్, బొంతు రాజేశ్వరరావు, డాక్టర్ రాపాక రమేష్ బాబు, తాడి మోహన్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, దిరిశాల బాలాజీపాల్గొన్నారు.

పి.గన్నవరం: తాడేపల్లిగూడెంలో ఈనెల28న జరిగే టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి బహిరంగ సభకు భారీగా తరలివెళ్లాలని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేదాశి సత్యనారాయణ(చిన్న) పిలుపునిచ్చారు.లంకగన్నవరంలో జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నామన రాంబాబు సతీమణి మృతిపై నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పెచ్చెట్టి వెర్రియ్య పెచ్చెట్టి వీరవెంకట సత్యనారాయణ, పడాల సూపర్, పైడి బుజ్జి, పసుపులేటి శివ, తోట రామకృష్ణ, వారణాశి ఏడుకొండలు, చీకరమిల్లి ప్రసాద్, గూటం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్మ మార్గానికి మూలం ఆధ్యాత్మిక చింతన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి26: ఆధ్యాత్మిక చింతనతోనే మానవులుధర్మమార్గంలో ముందుకు సాగుతున్నారని విజయనగరం శ్రీసమతానంద దుర్గా మహాపీఠాధిపతి శ్రీశ్రవణాచైతన్యానంద చినస్వామి ప్రవచించారు. విలసవిల్లిలోని శ్రీరామ మందిరంలో 17రోజులుగా కొనసాగుతున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహా సౌర యాగంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మహా సౌరయాగం విశిష్టతను వివరించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాలతో స్వామికి ఆశీర్వాదం అందించారు. యర్రమిల్లి కిరణ్‌శర్మ, పవన్‌శర్మ, మణికంఠశర్మ, కిశోర్‌శర్మ, ఆదిత్యశర్మ, కార్తీక్‌శర్మ పూజలు జరిపారు.

మహాశివరాత్రి ప్రాముఖ్యంపై ప్రచారం

ఆలమూరు, ఫిబ్రవరి 26: మహా శివరాత్రి పర్వదిన ప్రాముఖ్యతపై రాజమహేంద్రవరం త్రైత సిద్ధాంత సేవాసమితి ఆధ్వర్యంలో చెముడులంకలో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఇందూ విజ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు లక్ష్మీనారాయణ, జయరాం, సాత్విక్, రాణి, సూర్యకుమారి, వేణుమాధురి తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీలో చేరికలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26: వెలిచేరుకు చెందిన వారా కృష్ణవంశీ సోమవారం తన ఆత్మీయులతో బీఎస్పీలో చేరారు. కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రపు కొత్తియ్య, జిల్లా కార్యదర్శి త్రిమూర్తులు వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కృష్ణవంశీను మండల శాఖ ఉపాధ్యక్షుడిగా నియమించారు. కాండ్రేగుల నరసింహ, సాకా రాజారావు, కాండ్రు వెంకటేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అమలాపురానికి చెందిన యండమూరి లోకేశ్(22) సోమవారం మృతిచెందాడు. ఈనెల18న సిరిపల్లి-మునిపల్లి రోడ్డులో అనాతవరం పంచాయతీ గుబ్బలవారిపాలెం వద్ద జరిగిన మోటారు సైకిల్ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన లోకేశ్ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26: సోమిదేవరపాలెం పాటిమెరకకు చెందిన గంటి బాలయోగి(68) మనోవేదనతో ఈనెల15న మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. భార్య పుణ్యవతి పదేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు కూడా జరిపించాడు.